# ఊరి పిల్లోడు

ఆ పిల్లోని అస్సలు పేరు వాళ్లమ్మా, నాయినకూ తప్ప మల్లెవరికీ తెల్దు గానీ ఊళ్లో అందరికీ టంగుటూరోళ్ల పిల్లోడంటే తెల్సు. ఏడుస్తా వుండేవాళ్లకైనా ఆ పిల్లోని పడవ[1] సెప్తే, ఏడుపు ఇచ్చిపోయి మొకాన నగుపొద్దు పొడవాల్సిందే. అట్టాటోడు ఆ పిల్లోడు ! పిల్లోడంటే మాట కట్టా అంటా వుండాననుకొనేరు, పిల్లోడంటే పిల్లోడే. పదీ పదకొండేండ్లుంటాయేమో, బక్కగా నల్లగా వుండి మినమిన మెర్సే సూపుల్తో దేనిమీదా సిటికేసినంత సేపు సూపు నిలపకుండా బూలోకమంతా ఒక్కసారే సూస్తా వున్నెట్టు వుంటాడు. ఊరోళ్ళ కండ్ల ముందే ఆ పిల్లోని అమ్మా నాయినా టంగుటూర్నుంచీ ఈ ఊరికి ఎత్తి రావడం[2] ............ ఆ పిల్లోడిక్కన్నే పుట్టడం యిదంతా పదీపదైదేండ్ల కిందట జరిగిందే మల్ల. అయినా ఆ పిల్లోని సూస్తావుంటే ఈ ఊరు పుట్టిన కాన్నుంచీ ఇక్కన్నే ఇట్టనే వుండాడనిపిస్తాది !

ఇంట్లో యెప్పుడుంటాడో తెల్దు. ఎప్పుడు బువ్వ తింటాడో, యెప్పుడు నిద్రబోతాడో తెల్దు. ఎప్పుడు యాడుంటాడో కూడా తెల్దు. వాళ్లమ్మగానీ యెప్పుడన్నా ఆ పిల్లోన్ని కనుక్కోవాలంటే ఎన్ని తిప్పలు పడాల్నో పాపం ! "మా పిల్లోన్ని సూసినారా యాన్నన్నా" అని అందర్నీ అడుగుతాబోవాల. ఇప్పుడే ఏట్లో కనపడెనని యెవరన్నా సెప్తే, ఏట్లోకి బోయేతలికి "పలానోళ్ళ సేలో వుంటే ఇప్పుడే సూసినా" అని అక్కడ ఇంగొకరు సెప్తారు. యాడున్నట్టు తెల్సి ఆడికి పోతే, ఆన్నుంచి ఇంగోసాటికి పోయుంటాడు. తనయి కనపడ్తే తప్ప ఆ పిల్లోన్ని నరమానవులు కనిపెట్టలేరు. అయితే అందరికీ యాన్నో ఒక సాట కనపడ్తానే వుంటాడు.

పిల్లోడు గదా, పిల్లోళ్ళు ఆడుకొనే ఆటలేమన్నా ఆడ్తాడేమో అంటే అదీ లేదు. యీదుల్లో తోడి పిల్లోళ్ళు గోలిగుండ్లు, పుట్టసెండ్లు, బంగరాలు ఆడ్తాంటే ఆడుండనే వుండడు. ఆటలు రాకపోడమట్టా పోనీండి, ఆ పిల్లోనికసలు యేడ్సడం నగడమైనా రావేమో అనిపిస్తాది. ల్యాకపోతే ......... ఏడ్సంగా, నగంగా యెవురూ సూడకుండానే వుంటారా ? మాటలు బాగా యమ్డన్[3] మాదిరి మాట్లాడ్తాడని వాళ్లమ్మా నాయినా అంటారుగానీ, అయి గూడా యిన్నోళ్ళు లేరబ్బా. ఇయన్నీ యెట్లున్నాయెగానీ ఆ పిల్లోడు కనపడకపోతే, 'యెట్టపోయినాడబ్బా' అని అందరూ అనుకోవాల్చిందే.

ఏటిమిండ మనిషికి మనిషి కనపడకుండా సిక్కంగ మంచు కుర్సేతప్పుడు, మొగోళ్లు తలకు టువ్వాళ్లు[4] సుట్టుకోని, ఆడోళ్లు సెంగు కప్పుకోనీ నీళ్ల కోసం కడవలు తీసుకునివస్తే...... అప్పటికింగా తెల్లవారింటాడో లేదో జాలుపక్కన కూకొని నీళ్లలో సేపల్ను నిద్దరలేపుతాంటాడు ఆ పిల్లోడు ! ఒక్కొక్కసారి పయిమీద సొక్కా గూడా వుండదు. ఎండలు మండిపోయేతప్పుడు ఏట్లో బుర్ద గుంతలకాడ కూకోని, బుర్దతో బొమ్మలు సేస్తానో, ఒంటికాలి మీదుండే కొంగల్ను సూస్తానో వుంటాడు. మాంచి గాలికాలం ............ సేలల్లో, కుంటల్లోని నీళ్లు యిగిరిపోతాంటే, సేద్యాలు సేసేవాళ్ల గొంతులు ఆరిపోయి తట్టుకోల్యాక[5] పోతాంటే ఈ పిల్లోడు ఏ సెట్టు కిందనో కూకోని అట్లా గాలికి ఊగుతానే రెమ్మ మీదుండే ఏ పిట్టదిక్కో సూస్తావుంటాడు !

సేల మద్దెన లేసిన సుడిగాలి అబ్బాల[5] తిరుక్కుంటా పెరిగి పెరిగి ఆకాసెంలోకి వొగుడాకుల్ని[6]

1) ప్రస్తావన 2) వలస రావడం 3) రెండవ ప్రపంచ యుద్ధం నాటి జర్మన్ యుద్ధ నౌక పేరు, చురుకైన వాళ్ళను అట్లా అంటారు 4) తువ్వాలు, టవల్, తువ్వాలు కలిసి ఫస్టోబర్ లాగా అయ్యింది 5) పిల్లలు గుండ్రంగా తిరుగుతూ ఆడే ఆట 6) ఎండిన జొన్న ఆకులు

యిసిరేస్తే ....... ఆ ఎగిరే దిక్కు సూస్తావుంటాడు. యీదుల్లో తల్లి కోడి ప్యాదకడిని రొండు కాళ్లతో సిదిగి సిదిగి పిల్లల్ని 'క్రూర్, క్రూర్' అని పిలిస్తే, దూది బొమ్మలాల పిల్లలు పరిగెత్తేది సూస్తా వుంటాడు. పొద్దున్నే బండ్ల బాటలో పుల్ల దుమ్ము మెత్తంగ గందప్పొడి మాదిరిగి వున్నెట్టు కుక్కపిల్లలు పడి దొర్లుతా వుంటే సప్పుడుకాని నగునగుతా కూకోని అట్టనే సూస్తా వుంటాడు. ఊరిమీంద ఊరి సుట్టూ ఆకాసెంలో గద్దలు సుట్లు తిరుగుతా వుంటే, ఏటి వార్న తుమ్మసెట్ల మీంద రంగురంగుల రెక్కల్తో జుమ్మున జీరంగులు వాల్తా చేస్తా వుంటే ........ కండ్లార్పకుండా సూస్తో వుంటాడు. రాత్రయేప్పటికి యీటన్నిట్లో దేన్ని సూడల్యాకపోతానో అన్నెట్టు పగలంతా తిరిగి తిరిగి సూస్తాడు. రాత్రయితే ఒరే యీట్ని యింతవరకూ సూడల్యాకపోతినే అన్నెట్టు తెల్లవారీ వారందే బయల్దేరుతాడు.

అట్టాటోని నీళ్లల్లో నుంచీ సేపను తీసి గడ్డన యేసినట్టు, వాళ్ల నాయిన పొద్దుటూర్లో యెవురో సాములోరంట ఆయన ఆస్సెరంలో సదువుకోదానికని యిడ్సిపెట్టినాడు. కొడుకు ఎర్రోడయిపోతాడేమోని ఆయప్ప బయం. ఊళ్లో అట్టా అనుకోడం గూడా నిజమేలే. ఆ సాములోరు కూడూ, గుడ్డా పెట్టి సదువు సెప్తాడని అక్కడ యిడిసొచ్చినాడు. ఆయప్ప కొడుకును తీసకపోయి అక్కడ యిడ్సింది యెవరికీ తెల్దు. టంగుటూరోళ్ళ పిల్లోడు కనపల్లేదేమని ఒకర్నొకరు అడుక్కొని, అవతల వాళ్ల నాయిన్ను అడిగితే అప్పుడు తెల్చె ....... సదువుకొంటే మంచిదేలే, యిక్కడుంటే గాలికీ ఎండకూ తిరుగతా ఎందుకూ పనికిరాకుండా పోతాడు గదా... అనుకొన్రి.

అనుకొన్రిగానీ, ఆ పిల్లోడు కనపడకుండా పోతే అందరికీ యేందో తక్కువైనెట్టాయె. యాడ సూసినా కనపడేవాడు యాడా కనపడకపోతే, యెట్టనో అయిపాయె. ఊళ్ళో మనుసులే గాదు, ఆకాసెంలో ఎగిరే పిట్టలు, బూమి మీద తిరిగే జంతువులు అన్నీ "టంగుటూరోళ్ళ పిల్లోడు యేడీ?" అని యెతుకుతా వున్నెట్టు కనిపిస్తాయి.

రొండు వారాలయ్యేసరికి పిల్లోనికి ఆరోగ్గిం బాగా లేదని, జరమొస్తా వుండాదనీ జాబొస్తే, వాళ్ల నాయిన పోయొచ్చినాడు, బాగనే వుండాదని సెప్పినాడు. మల్లవారానికే సాములోరే జాబు రాసినాడు – 'పిల్లోడు యిక్కడుంటే దక్కడు, యెంటనే తీసుకుపొమ్మని'. ఆ జాబు సూసి ఆలూ మొగుడూ పరిగెత్తిపోయి కండ్లల్లో పానం పెట్టుకొని వున్న కొడుకును సెరింత దూరం మోసుకుంటా వూరికి బయల్దేరిరి.

మబ్బు గప్పినోడు[7] పడిపోయినట్టు వాళ్లనాయిన బుజం మీద తలకాయ యాలేసి పండుకొన్నాడు. సరిగ్గా ఊరి పొలిమేర తొక్కేసరికి ఆ మట్టి వాసన తట్టి లేపినట్లు కండ్లు తెర్సినాడు. ఇంగ అప్పట్నుంచీ తను పోయేతప్పటికున్న యన్నీ వున్నయా, లేవా అన్నెట్టు సూడడం మొదలుపెట్టినాడు. బుజం మీద కొడుకు కదలిక మోసుకొంటా వస్తున్న నాయినకు తెల్చుతా వుంది. ఊరంచుకు వచ్చేతలికి, అంతవరకూ కువ్వగా యేసిన తీగసుట్ట గుంజి బిగిస్తా వున్నెట్టు బుజం మీదున్న శరీరం నుంచీ వచ్చే పెద్ద తాకిడి ! ఇంగ తట్టుకోలేనట్టు నాయిన మెడకు పుల్లల మాదిరున్న రొండు సేతులూ సుట్టేసి "అబ్బ ! ఎన్నాళ్లకు మనూరి గద్దలు మళ్ళా కనపడె నాయనా" అనె.

కొడుకు మాటలుయిన్న అమ్మా నాయనకూ యెప్పుడన్నా అయితే నగు రావాల్చింది. అప్పుడు రాకపోయె, పైగా కండ్లు తడాయె. కొడుకు ఎర్రోడయినాడనుకోవల్చింది, అనుకోలా. కండ్లల్లో నీటిని రెప్పల్తో, బుజం మీది కొడుకును రొండు సేతుల్తో అదిమి పట్టుకొని.... ఊర్లోకి, అవు....... ఊర్లోపలికి, కడుపులోకి తీసకపోయినట్టు తీసకపాయె. ✿

---

7) మూర్ఛలో ఉన్నోడు